# ...వెలుగులోకి

"తొందరలేదు. రేపు ఆఫీసులో చెప్పండి" అంటూ చకచకా వెళ్ళి పోయాడు నాయర్. నేను ఆలోచనల్లో మునిగిపోయాను.

• • •

కాలేజీలో చేరిన క్రొత్తల్లో రోజూ-సాయంత్రం నేను యింటికొచ్చే సరికి నాన్నగారి మిత్రులెవరో వచ్చి కబుర్లాడుతున్నారు. అమ్మా, అమ్మమ్మా కూడా హాల్లోనే వున్నారు. నేను నా గదిలోకి వెళ్తుంటే-ఆ మిత్రుల్లో ఎవరో అన్నారు, "అమ్మాయికి చక్కగా చిన్నతనంలోనే పెళ్ళి జరిపించేయండి రావ్‌గారూ. ముచ్చటగా వుంటుంది."

నేను వులిక్కిపడ్డాను. ఆగి, చురుగ్గా వాళ్ళకేసి చూశాను. 'మగాడి చేతికింది నీళ్ళు తాగడం నాకిష్టం లేదు. నేనసలు పెళ్ళి చేసుకోను' అని ఒక్క ఉదుటున గదిలోకి వెళ్ళిపోయాను. నా నిర్లక్ష్యానికి అందరూ అవాక్కయి పోయారు.

ఆ రాత్రి-అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. నేను అలా అనకూడదని కోప్పడింది. అన్నాలవీ అయిన తర్వాత నా చుబుకాన్నెత్తి కళ్ళలోకి చూస్తూ -'ఊరికే నవ్వులాట కన్నావు గదూ?' అని పదేపదే ప్రశ్నించింది. 'నేను నిజంగానే అన్నాను' అని జవాబిచ్చేసరికి తల్లీ, కూతుళ్ళు ప్రూన్పడిపోయి మొహాలు చూసుకున్నారు.

అమ్మా, అమ్మమ్మా, నాన్న-ఆ రాత్రి జాగారం చేశారు. ఆతర్వాత కొన్నాళ్ళపాటు ఆ ముగ్గురూ నన్ను దయ్యంలా చూసే వాళ్ళు. క్రమంగా ఆ కథ పాతబడింది. నేను చదువుల సరస్వతినని పేరు తెచ్చుకుంటూ, యూనివర్సిటీ 'రాంక్'లు కొట్టేస్తూ-ఎదిగిపోయాను.

—ఎమ్మెస్సీ అయిన తర్వాత ఓ రోజు

బాల్కనీలో కూర్చొని నైట్‌క్వీన్ సువాసనల్ని ఆఘ్రాణిస్తూ దశమి వెన్నెలలో జలకాలాడుతున్నాను. నాన్న వచ్చి ఎదురు కుర్చీలో కూర్చున్నారు. క్షణాల తర్వాత పెళ్ళి ప్రసక్తి తెచ్చారు.

"మీ యిష్టం" అన్న నా సమాధానంతో నాన్న గుండెలు పండించు కున్నాడు. పడుకోబోయే ముందు అమ్మమ్మ నన్ను పిలిచి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని-"ఇంక నేను హాయిగా చచ్చిపోతానే శారదా" అన్నది. ఆమె కళ్ళల్లో తడి, మాటల్లో ఆర్ద్రత-నన్నూ కదిలించి వేసినై.

మర్నాడు—

మా యింట్లో పెద్ద పండుగే జరిగింది. పెద్ద వాళ్ళు ముగ్గురూ కూర్చుని మురిపెంగా అనేక రకాల ఆలోచనలు చేశారు. నా పెళ్ళి గురించి అందరిదీ వొకే అభిప్రాయం-నా చదువుకీ అందానికీ తగిన వరుణ్ణి చూడా లని "ఒక్కగానొక్క పిల్ల" "దాని సుఖం ముఖ్యం మనకు" అను కున్నారు. నేను మాత్రం నా షరతుని నాన్నకు చెప్పి వుంచాను. అది గుర్తు రాగానే ఆయన నా వేపు విషణ్ణ వదనంతో చూసేవాడు.

ఏడాది తిరిగే సరికి-నలుగురు పెళ్ళి కొడుకులు నన్ను "పరీక్ష" చేసి వెళ్ళారు. అమ్మమ్మ పోయింది. ఆమె ప్రాణం కళ్ళల్లో నుంచి పోయింద న్నారు. నాకు మాత్రం ఆమె కనురెప్పలు నా దిశగా తెరుచుకుని వున్నట్టే అనిపిస్తుంది.

నేను మళ్ళీ యూనివర్సిటీలో చేరేను.

రీసెర్చి అయిపోయింది. డాక్టరేట్ రావడం, కెమిస్ట్‌గా వుద్యోగం రావడం ఒకేసారి జరిగేయి. నాన్న నా షరతుని సడలించమని కోరాడు. నేను అంగీకరించలేదు.

నేను బరోడా వెళ్ళాను.

నాన్న టెలిగ్రామ్‌ల మీద విజయవాడ వచ్చేదాన్ని. మర్నాడు మామూలు కార్యక్రమం, తలంటిపోసుకోవడం, పట్టుచీరె సింగారించుకోవడం, మస్తుగా ముస్తాబు కావడం, ప్రశ్నలు-సమాధానాలు, పరీక్ష, రెండో రోజునో మూడో రోజునో తిరుగు ప్రయాణం. ఈ ప్రయాణాలు ఇలాసాగుతుండగానే, 'ఛీఫ్‌కెమిస్ట్'గా బొంబాయి వచ్చేశాను.

-ఫోన్ రింగవుతుంటే ఈ లోకంలో పడ్డాను. రిసీవర్ అందుకున్నాను. అవతలివైపు శాంత మాట్లాడుతోంది, "నువ్ అర్జంట్‌గారావాలి. కారుందిగా అని పిలుస్తున్నాను. త్వరగా వచ్చెయ్"-ఆమె కంఠ స్వరంలో దుఃఖపు జీరలు తారాడుతున్నయ్. విషయ మేఁవిటని నేనడిగేలోగానే ఫోన్ పెట్టేసింది.

శాంత నా సహోద్యోగిని. మా ఇద్దరి మధ్యా మంచి మైత్రి వుంది. ఒకే భాష మాట్లాడే వాళ్ళం కావడాన సాన్నిహిత్యం పెరిగింది.

నే వెళ్ళేసరికి ఇల్లు ఆరిన కుంపటిలా వుంది. శాంత కళ్ళల్లో తడీ, చెదిరిన వెంట్రుకలూ, చూపుల్లో ఎడారులూ,-ఆమె బాధను వ్యక్తం చేస్తూ ప్రత్యక్షమైనాయి. గదిలో వో మూలగా పిట్టలా ముడుచుకుని కూర్చుని వుంది. ఛాయ మోకాళ్ళమీద తల ఆనించి ఏడుస్తోంది. మరో గోడవారగా కుర్చీలో సుందరం-శాంత భర్త.

నేను కూర్చున్నాను. శాంత మొదలెట్టింది. "నీకు చెప్పాను కదా-మంచి సంబంధం వచ్చింది, ఛాయకు పెళ్ళి చేసేద్దామనుకుంటున్నామని". నేను అవునన్నట్టు తల వూపేను. "ఈఁవిడగారికి ఈ పెళ్ళి ఇష్టంలేదుట.

మేము బలవంతం చేస్తున్నామని-రాత్రి స్లీపింగ్‌పిల్స్ మింగి చస్తుందిట." శాంత కోపంలో ఆవేదన, ఆవేదనలో కోపం మిళితమై వున్నై.ఆమెబాధ అర్థమైంది నాకు. తల్లీ తండ్రీ లేని చెల్లెలు ఛాయకి, తానే సర్వస్వమై ఆమెని కంటికి రెప్పలా సాకుతోంది శాంత. ఛాయ ఈ ఏడాదే బియ్యేస్సీ పూర్తి చేసింది. సుందరం పదివేల కట్నంతో ఛాయకి వరుణ్ణి నిశ్చయించాడు. అతనేదో ఫరమ్‌లో ఆఖాందలు తెచ్చుకుంటున్నాడు. ఈ వివరాలన్నీ నాకు శాంత ద్వారా ఇదివరకే తెలుసు.

"నువ్వైనా కాస్తంత బుద్ధి చెప్పిపోతావని పిలిచాను." అంటూ వంటింట్లోకి నడిచింది శాంత. నేనూ ఆమెను అనుసరించాను.

కాఫీ తాగుతూ చెప్పాను. "నాలుగు రోజులు పోనీ, మళ్ళీ వచ్చి మాట్లాడతాను.ఈ నాలుగు రోజులూ ఛాయతో మీరు ఈ విషయం మాట్లాడకండి, ఆ పిల్లని రెస్ట్ తీసుకోనీ."

నేను వస్తుంటే గుమ్మంలో నిలబెట్టి నెమ్మదిగా చెప్పింది శాంత: "రాత్రి పడుకోబోయే ముందు నీ పెళ్ళి కథను వివరంగా చెప్పాను కూడా-అర్థం చేసుకుంటుందేమోనని, అయినా దానికి బుద్ధి రాలేదు."

మౌనంగా నవ్వి కారెక్కాను.

ఇంటికి చేరేసరికి పదిగంటలు దాటింది. నా గదిలోకి వెళ్ళిపడుకున్నాను. సరమ్మ వచ్చి భోజనానికి పిలిచింది. వద్దని చెప్పిపంపించాను.

ఒకేకొట్లో కుక్కిన ఖైదీల్లా ఆలోచనలు తిరుగుబాటు చేస్తున్నాయి-నా మేధస్సులో 'నీ పెళ్ళి కథని వివరంగా చెప్పాను:-శాంత మాటలు నా బుర్రని తొలిచేస్తున్నాయి. అవును-నా పెళ్ళి కథ-అది తలచుకుంటే-కొత్తల్లో పిచ్చుకలు కిచకిచమన్నట్టు స్వాగత గీతాలు పాడుకునేదిమనస్సు. ఇవ్వాళ?!-

ఎమ్మెస్సీ కాగానే ప్రారంభమై-ఇప్పటికి పదేళ్ళుగా సాగుతున్న నా పెళ్ళి కథ-ఇవ్వాళ-పాలల్లో ముంచి తీసిన బొగ్గులా వుంది.

నా పెళ్ళి కథ గుర్తుకు వచ్చేసరికి-గదంతా చాలా ఇరుకుగా వున్న ట్లనిపిస్తోంది. మనసును చిరాకు ఆవహించింది. లేచి ఫ్యాన్ వేసుకున్నాను. తిరుగుతున్న ఫ్యాన్ ఆకులు సృష్టిస్తున్న వెలుగునీడల్లో నా పెళ్ళి కథలోని పాత్రలన్నీ కళ్ళముందు కదలసాగినై. పెళ్ళి చూపుల తతంగంతో నా దేహాన్ని స్పృశించిన చూపులూ, ఆ చూపుల వెనుకగా వినబడిన కూతలు గుర్తుకు రాసాగినై.

రాజారావ్-డాక్టర్! ఇరవై వేలిస్తే ఆలోచిస్తాడు.

సత్యమూర్తి-ఇంజనీరు. ఉన్న ఇల్లూ, పొలం తన పేర రాస్తే వస్తాడు.

చక్రపాణి-గ్రేడ్ వన్ ఆఫీసర్-వుద్యోగం దొరకిన తర్వాత మళ్ళీ కబురు చేస్తే వస్తాడు.

చంద్రమోహన్-లెక్చరర్ మరీ ఇంటలిజెంట్‌గా వుంది. ఇంత తెలివిగల భార్యని భరించలేడు.

రామ్మూర్తి—పోస్ట్‌గ్రాడ్యుయేట్; యూడీసీ 'భార్యా రూపవతీశత్రుః' భయం.

కృష్ణారావు, సుదర్శనం—అమ్మా నాన్నల దృష్టిలో వరహీనపు పెళ్ళి కొడుకులు.

చివరిసారి విజయవాడ వెళ్ళినప్పుడు నాన్న పరిస్థితి కళ్ళ నీళ్ళ పర్యంతంగా వుంది. ఆయన ప్రాథేయ పూర్వకంగా అన్నాడు "నీ షరతుల వలన ఇప్పటికి పదేళ్ళు గడిచిపోయినై, నలుగురి నోళ్ళల్లోనూ మన మాటే నానిపోతుంది. కూతురి పెళ్ళి చేయలేని అసమర్థుడిగా ఎన్నాళ్ళు నిలబెడతావమ్మా నన్ను" అని.

ఇక అమ్మ సరేసరి నేనున్న ఆ రెండు రోజులూ నిరాహార దీక్ష చేసింది.

నేనూ బాధపడుతూ తిరిగి వచ్చాను.

హఠాత్తుగా-కథలోకి-నాయర్ ప్రవేశించాడు. అతను మా ఆఫీస్ కాంటీన్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు.

"మీతో ప్రత్యేకంగా మాట్లాడాలి. మీ యింటికి వస్తాను. ఎప్పుడు రావచ్చో చెప్పండి" అన్నాడు మొన్న సాయంత్రం. ఆశ్చర్యపోయాను అతని ప్రశ్నకు. ఆదివారం రమ్మన్నాను.

ఇవ్వాళ సాయంత్రం ఆరుగంటలవుతుండగా వచ్చాడు.

కాఫీలయిన తర్వాత మొదలెట్టాడు.

"ఏడేళ్ళప్పుడు ఇంట్లో నుంచి వచ్చేశాను. వెనకా ముందూ ఎవరుండే వాళ్ళో. ఏమోగానీ-ఇప్పుడు నా వాళ్ళని చెప్పుకోదగిన వాళ్ళెవరూ లేరు. ఒంటరి వాణ్ణి. నా ధైర్యానికి మీరు మరోలా అనుకోవద్దు శాంత గారూ, ఇతర తెలుగు వాళ్ళు మీ పెళ్ళి కథ గురించి మాట్లాడుతుంటే చాలాసార్లు విన్నాను.

మీకు తెలుసుగా-నాకు తెలుగు వచ్చు-పదేళ్ళు విజయవాడలో వున్నాను చిన్నప్పుడు"

చెప్పటం ఆపి-నాకేసి చూశాడు. "ఊఁ" అన్నాన్నేను.

"మీకు అభ్యంతరం లేకుంటే నేను మిమ్మల్ని పెళ్ళాడాలనుకుంటు న్నాను." చాలా నింపాదిగా చెప్పేడు.

నేను విస్తుపోయాను.

ఆశ్చర్యం నుంచి నేను తేరుకునే లోగా అతను లేచి నిలబడ్డాడు, "తొందర లేదు-రేపు ఆఫీసులో చెప్పండి" అంటూచకచక వెళ్ళిపోయాడు నాయర్.

నేను ఆలోచనల్లో మునిగిపోయాను.

*　　　*　　　*

ఛాయ తన పెళ్ళికి అంగీకరించక పోవడానికీ, నాకు ఇంత వరకూ పెళ్ళి కాకపోవడానికీ కారణం ఒకటే అని తెలిసి ఆశ్చర్యపోయాను. శాంత నన్నెలాగయినా ఛాయకి నచ్చ చెప్పి పెళ్ళికి వొప్పించ మని కోరింది.

ఇటు నాయర్ కోరిక—

అటు శాంత కోరిక—

నేను నాయర్ కోరికని అంగీకరిస్తే, ఛాయని పెళ్ళికి వొప్పుకోమని చెప్పలేను.

కారణం?—

కట్నం తీసుకునే వరుణ్ణి పెళ్ళి చేసుకోనన్నది నా షరతు. నాయర్‌ను పెళ్ళి చేసుకుని ఆ షరతుని చెల్లించుకోగలను. కానీ, కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకోననే తన షరతుని వుల్లంఘించమని ఛాయకి సలహా ఇవ్వలేను.

చిత్రమయిన సందిగ్ధత: నేను పాటించిన ఆశయాన్ని మరొకరు పాటిస్తున్నారని ఆనందించడానికి బదులు - ఆ ఆశయాన్ని ఆచరించవద్దని సలహా యిచ్చి, స్నేహితురాలి కోరిక తీర్చటం ఎంత వరకూ సమర్థనీయం?

అనుభవం నేర్పిన గుణపాఠం వలన, ముదికన్యగా మిగలడం వలన ఆశయాన్ని గాలికి వదిలి పేలపిండిలా మార్చడం వివేకంతో కూడిన పనేనా?.

మనస్సు ఏన్నో ప్రశ్నలు వేస్తోంది.

—మేధస్సు అలిసిపోయింది. నాకు నిద్ర వస్తోంది.

*   *   *

నాయర్ కూ, నాకూ పెళ్ళి జరిగింది.

ఛాయ ఎమ్మెస్సీలో చేరింది.

కాలం విలువైనదే కావచ్చుగానీ, సమాజానికి ఆరోగ్యకరమైన ఆశయాన్ని నేర్పటం మరింత విలువైనది.

ఆశయంతోపాటు కాలం కూడా ఛాయని దీవించాలని శుభాకాంక్షలు చెప్తూ సెలవు....!!!